


# చర్విత చర్వణం

కథానిక

ధనిష్ఠ

"ఏమండీ మిమ్మల్నే"

"ఊ"

"యింకా నిద్దరేమిటండీ?"

"అబ్బ ఏమిటే చంపుతావు?"

"అప్పుడే ఏడుకొట్టి ఎంతసేపైందండీ! పోనీ ఆదివారంగదా మార్కెట్టుకెళ్ళి కూరలు అవీ పట్టుకొస్తారేమోననుకున్నాను. అదీలేదు యిదీలేదు సరిగదా లేవనైనా లేవరేమండీ. కాఫీ చల్లారిపోయింది మళ్ళీ చల్లటికాఫీ సొక్కదాయెను. ఎంతకని వేగను. పోనీ పొద్దుట నించి పనిలో సతమతమౌతున్నానని జాలీ నెనరు ఏనాలేదుగదా."

"ఇంకీ ప్రవాహం ఆగేట్టు లేదేం? నేనుగాడ మొదలెట్టేదా సాధింపు? మేనమామకూతురుగదా అని మనసుపడి పెళ్ళాడితే మొహాన మొద్దులు కొట్టడమేకదా. వారంవార్రం అల్లా కష్టపడి పని చేసి ఆదివారం ఒక్కపూట నిద్రపోతే ఓర్చలేవు కదా—"

"బాగుంది సాధింపు. కాని నేనన్నదాంట్లో తప్పేముంది? బంట్రోతునిపంపరాదా అంటారు కూర్లకి. వాడిదేంపోయింది? అయినకాటికి బేరమేనా ఆడకుండా తీసుకొస్తాడు చచ్చోపుచ్చో. ఆ జడ్జీగారు చూడరాదు, కారుమీదవెళ్ళి కూరలెల్లా తీసుకువస్తాడోను. మనకిమాత్రం రాజసం!"

"నేనన్న దాంట్లో మాత్రం తప్పేముంది. మా రాధగాడి పెళ్ళాంచూడరాదు వాణ్ణి నెత్తినెట్టుకుంటుంది. నువ్వో కాల్చుకు తింటావు."

"మీతో మాట్లాడుతూ కూర్చుంటే అవతల వంటతగులబడి పోతుంది. కూరలు తెమ్మన్నానని నన్నాడిపోసుకుంటారుగాని వండిపెడితే మళ్ళీ బాగానే ఉంటుంది. తెచ్చుకున్నారో వండిపెడితే తిన్నారో. మళ్ళీ మీరే అంటారుగా అన్నంలో ఏముంది కూరల్లో అయితే విటమిన్లూ అవేవో ఉన్నాయి! పోనీ వెళ్ళకపోతేమానెగాని కాలకృత్యాలు తీర్చుకుని ఆకాఫీ టిఫిను కానిస్తేసరి. టూత్ బ్రష్ పేస్టూ, వేన్నీళ్ళు అన్నీ సిద్ధంగా ఉన్నాయి"

"వండిపెడితే నేనొక్కణ్ణే దూ తినేది? మళ్ళీ మారేనా లేకుండా మూతెట్టుకుంటావ" అన్నాను కొంటెగా నవ్వుతూ కమలకేసిచూస్తూ.

"పాపం! మీరే తక్కువ తిన్నారు. ఆవాళ సినిమానించి వచ్చింతరవాత ఇంట్లోవాళ్ళందో లేనోనసైనా ఆలోచించకుండా తిని 'అయ్యో పాపం' అన్నారే" అంది మాటకిమాట అందిస్తూ.

ఇంట్లోకి పోబోతూన్న కమలని జడంట్టుకుని ఆపాను.

"ఎన్నేళ్ళొచ్చినా ఇంకా యిదే తంతు. ఎవరైనా చూసి నవ్వుతారలైనాలేదు మనిషికి" అంది భ్రూకుటిముడివేస్తూ చిరుకోపంతో.

"అవును ఎవడి..."

"మీతో వాదించలేనుబాబూ! కాలికివేస్తే తలకి, తలకివేస్తే కాలికి. నన్నేమైనా చదివించారా ఏం మీతో వాదించగలగడానికి. మా నాన్నేమో పల్లెటూరివాడయ్యె—"

'ఇప్పుడేంతక్కువైంది. నువ్వు చదువుకోకపోయినప్పుడే ఇల్లావుంది. ఇకనువ్వేచదువుకుంటే నన్నుపాయ్యదగ్గరేకూర్చోబెట్టేదానివి."

"మీతో వాదనేసుకుని కూర్చుండుకు నాకు తీరికలేదు. నన్ను పోనీయండి" అంది.

"ఇప్పుడీ చేసినదంతా ఏమిటో. పైగా తీరిక లేదట. ఆ మాడిపోయే కూర, తగలడిపోయే వంటా ఏమయ్యాయో!"

"బాబూ మీకో దండం. నన్ను మాత్రం వదిలెయ్యండి. ఇష్టముంటే వెళ్ళండి లేకపోతే లేదు. అసలు తప్పు నాదే. లేకపోతే వెళ్ళరని తెలుసుండీ మొర పెట్టుకోవడ మేమిటి? నా నోరు పారేసుకోడం తప్పు" అంది అక్కస్సంతా వెళ్ళగక్కుతూ.

"సరే వెడతాన్లే."

"నిజమే? అయితే యివాళేదో ప్రళయంపట్టేట్టుందే. అయ్యగారింత సుముఖులుగా ఉన్నందుకు" అంది లోలోన సంతోషిస్తూ అది బయటు పడనీయకుండా ఉండడానికి విఫల ప్రయత్నం చేస్తూ.

"రాణీగారి మాటకెదురాడి యీ యింట్లో మనడమే" అన్నాను నేను కమలకేసి భయపడుతున్నట్టు చూస్తూ.

"వావ్వ! ఎవరైనా వింటే నిజమనుకుంటారు కూడాను. చెవినిల్లు కట్టుకునిపోరితే ఇష్టంలేకపోయినా పోరుపడలేక సరేనని పైగా ఆమాటలు చూడాలి! మహా రోజూ వినేవాళ్ళకే చెల్లను అలా మాట్లాడడానికి" అంది బుగ్గలు నొక్కుకుంటూ.

"సరే బంట్రోతేమయ్యాడు. ఆ లిస్టురాసి కావలసినవి సిద్ధంచెయ్యి. నేనీలోపున కాలకృత్యాలు తీర్చుకుని వస్తాను" అన్నాను కాలకృత్య నిర్వాహణానికుపక్రమిస్తూ.

కాలకృత్యాలు కానిచ్చి ఘుమఘుమలాడుతూ నాకై ఎదురుచూస్తూన్న కాఫీ టిఫిన్లమీద దండయాత్ర సాగించాను.

చేతులు కడుక్కోవడం తడవుగా—

"కమలా! కమలా" అని కేకేసాను.

"........"

"కమలా!" ఇంకొంచం గొంతుక పెద్దదిచేసి కేకేసాను.

"ఓయ్ వస్తున్నా" అంటూ వచ్చి తడిచెయ్యి చీరకొంగుకు తుడుచుకుంటూ గుమ్మానికి జారబడుతూ అంది:

"కొంప మునిగిపోయినట్టు గావుకేకలెడతారేం?"

"ఆ లిస్టు యిల్లా యియ్యి వెళ్ళొస్తాను."

"అయితే వెడతారన్నమాట. ఇప్పుడే రాసిస్తానుండండి."

"ఏమిటీ? ఇంతసేపు నన్నంత తొందరపెట్టి నానా రభసచేసి, ఇంకా లిస్టు రాస్తుందట! లిస్టు" అన్నాను కోపం నటిస్తూ.

"మంచివారుకదూ! రెండునిముషాలే" అంది.

"వంటవతల చెడిపోతుందేమో ముందర చూసిరా. అయినాలశ్యం ఎల్లాగా అయింది."

"అబ్బే వంటాలేదు పెంటాలేదు. మీరూరికే పిల్చారేమోనని అల్లా అన్నాను. అసలు మీరు కూరలు పట్టుకొస్తేగాని పొయ్యిలో పిల్లిలేవదు" అంది నాకేసి కొంటెగా చూస్తూ.

"అమ్మదొంగా! ఈ శిక్షకూడ నాకేనన్న మాట. సరే తప్పుతుందా!"

ఇంకాస్సేపు సంభాషణ పొడిగించకుండా బంట్రోతుని తీసుకుని బజారుకెళ్ళాను. పాపం కమలనేదీ నిజమే. కూరలన్నీ నవనవలాడుతూ పచ్చికాయలు తినేటట్టున్నాయి. ఈ బంట్రోతు వెధవైతే వూరంతా తిరిగి తీరుబడైనప్పుడు తీసుకొస్తాడు చచ్చోపుచ్చో. కూరలుకొని యింటికితీసికెళ్ళాను. కూరలుచూసిన కమల మొహం గంపంతయింది. శ్రీమతి మొహం కలకల్లాడడంతో నాకూ ఆనందమయింది.

ఆదివారంగదా మధ్యాహ్నం ఒక గంటసేపు నిద్రపోదామనుకుంటుండగా రాధాకృష్ణ వచ్చాడు.

"రారా రాధా! ఎప్పుడొచ్చావు కాంపునించి? నిన్న సుశీల్నడిగితే యింకా రాలేదంది."

"రాత్రి ట్రైనులో వచ్చానురా. ఆదివారం గదా అని యిల్లా వచ్చాను." అన్నాడు.

"కమలా! రాధ వచ్చాడు."

రాధకి నాకు స్నేహంతో సుశీల నాకు చెల్లెలి వరస. రాధగాడు కమలకి అన్న వరస. మాటల్లో పడ్డామంటే యింక తెరిపే ఉండదు. నా మీది ఫిర్యాదులన్నీ రాధగాడికి నివేదిస్తూంటుంది కమల.

వస్తూనే అందుకుంది.

"అన్నయ్యా, ఇవాళ మార్కెట్టు కెళ్ళమంటే మీబావ చేసిన అగడం యింతా అంతా కాదు.

సుశీల నిన్ను నెత్తికెక్కించుకుంటోందిట. నేనేమో వారిని కాల్చుకు తింటున్నానుట."

"ఇదే కాల్చుకుతినడమైతే నీపనే నయంరా గోపాలం! అయినా మీ చెల్లెలివరస తెలీనట్టు మాట్లాడుతావేం. మార్కెట్టుకెళ్ళమంటే అంత బాధేం? మళ్ళీ తినడానికేం బరువులేదు." అన్నాడు చెల్లెల్ని బలపరుస్తూ.

"కూరొండితే నేనేరా తినేది. మీ చెల్లెలికీ కూరలకీ చుక్కెదురు." అన్నాను కమలకేసి చూస్తూ నవ్వుతూ.

"అబ్బే! మీరు కూరసలు ముట్టనేముట్టరు," అంది దెప్పుతూ.

"ఈ వాదులాడుకునేబదులు సుశీల్ని కూడా తీసుకువస్తే రాత్రికి ఇక్కడే భోంచేసి సినిమాకి వెళ్ళొచ్చు" అన్నాను.

"అవునన్నయ్యా. అయినా ఆదివారం కదా వదిన్నెందుకు తీసుకురాలేదు?" అంది కమల.

"అబ్బె అదెందుకమ్మా మళ్ళీ?" అన్నాడు మొహమాటపడుతూ.

"మాయింట్లో మొహమాటమేమిట్రా నీకు? కావలిస్తే నువ్వెళ్ళిపో. మా చెల్లెల్ని మేం తెచ్చుకుంటాం." అన్నాను నేను.

"అబ్బో అభిమానమంతా చెల్లెలిమీదే కాబోలు మీరే వెళ్ళండి మా అన్నయ్యే ఉంటాడు." అంది అన్నగారికి ఆసరాగా.

"పోనీ ఆత్మ మర్యాద తెలిసిన దానివిచు వ్వెళ్ళి తీసుకురారాదు. ఇలా వాగకపోతే" అన్నాను.

"సరే నేనే వెడతాను. ఆ విధి నాకుమాత్రం పరాయిది గనకనా. మీ చెల్లెలిగా కాకపోయినా మా వదినగా నయినా నాకు విధాయకమే."

అని బండిచేసుకుని వెళ్ళి సుశీలని తీసుకుని వచ్చింది.

"ఏమమ్మా! వాడు రమ్మనకపోయినా, ఆదివారం గదా నువ్వెందుకు రాలేదూ? మీ అన్నగారింటికి గూడా పిలుపు కావాలా?" అన్నాను సుశీల నుద్దేశించి.

"నువ్వు రమ్మన్నంతమాత్రాన వస్తే మా వదిన కభ్రచ్చుకోదూ?" అంది కమలకేసి చూసి నవ్వుతూ.

"మరి మనింటికివచ్చేవాళ్ళకి నువ్విచ్చే మర్యాదంతేగా? కామెర్ల కళ్ళకి లోకం అంతా పచ్చగా కనబడుతుందిట" అన్నాడు రాధాకృష్ణ కమలా సంరక్షణార్థియై.

"అబ్బో! మళ్ళీ శ్రీకృష్ణుడవతరించాడండో! ద్రౌపదీ సంరక్షణార్థమై. ఎల్లాగయితేనేం చెల్లెలను వెనకేసుకొచ్చావులే. చెల్లెల్ని వెనకేసుకొస్తే నాకేం బాధలేదుగాని నిక్షేపంలాంటి మా చెల్లెల్నంటే మాత్రం నేనూరుకునేదిలేదు" అన్నాను.

"మీ బావెప్పుడూ అంతేలెస్తూ" అంది సుశీల ముసిముసి నవ్వుల్తో మొగుడికేసి చూస్తూ.

"ఇంకీ వాగ్యుద్ధం అంతంచేసి పేకాటాడుకుందాం కాస్పేపు కమలా! డ్రాయింగురూంలో బీరువాలో ఉంది పట్టుకురా" అన్నాను.

కమల పేక తీసుకువస్తూ,

"నేనూ మా అన్నయ్యా ఒక పార్టీ" అంది.

"నాకు మరీ మంచిది. అయినా నేను నీతో ఒకే పార్టీలో ఉండి వేగలేను" అన్నాను.

అడ్డాట ఆరంభమైంది. కలుపు నేనే తీసుకున్నాను. నా చేతిలో పేక ఉన్నంతసేపు ఆట ఉన్నా లేకపోయినా చెప్పెయ్యడం నా కలవాటు, డబ్బు పోయేదేం లేదు గనక సాధారణంగా నే నాటలో ఉంటే ఇంక పేక కలుపవలసిన భారం తప్పిపోతుంది అందరికీ. అదృష్టమో దురదృష్టమో ఆవాళ మొదటిసారే కలుపు తిరిగిపోయింది. రాధాగాడు తీసుకున్నాడు.

"అంత కక్కుర్తి ఎందుకు. కిందవాసి ఆట చెప్పడం కూడ ఒక గొప్పే!" అంది సుశీల రాధగాడు చేసిన పనిని కనిపెట్టి.

వాడు ముక్కలు విప్పి మళ్ళీ పంచాడు.

"ఆట" సుశీల అంది.

"పైఆట" కమల.

"అయితే నేనేనా తక్కువ తిన్నది. నాదియింకా పైచెయ్యి" అన్నాను.

"నాది కలుపుచెయ్యి. ఆరకు" అన్నాడు రాధగాడు.

"అడ్డు" అన్నాను.

"షరతు" అన్నాడు రాధ ఉక్రోషంతో.

"అయ్యో! అదేమిటన్నయ్యా" అంది కమల గాభరాగా.

"ఎందుకమ్మా అంత కంగారు? వాడికి మహా ముక్కలుండే అడ్డుచెప్పాడా."

"మరి నీలాగ కిందముక్క చూడలేదుగా" అన్నాను.

"మహా మీరే తక్కువ. మా వదిన చూపించిన ముక్క చూసి అడ్డు చెప్పడం గూడ ఒక గొప్పే. ఏవమ్మా మాట్లాడవేం ముంగిలా. ఇందాకా మీ ఆయనన్నట్టు లేదూ?" అంది.

"ఎవరిమటుకు వాళ్ళే తప్పు చేస్తూండేది. ఎదర వాళ్లననేది. ఆయన చెప్పిన తురఫులో ముక్కలెన్నున్నాయో చూపించమను. మహా నువ్వు న్యాయమూర్తిలా మాట్లాడతావేం. నేను చూడలేదనుకున్నావు" అంది కమల గుట్టు బైటపెడుతూ.

"ఎవరికెవరూ తీసిపోరు. ఈ ఆట కలిపెయ్యండి" అంది సుశీల.

"ఇంక ఆట కట్టెయ్యండి" అంది కమల.

"కమలా నువెళ్లి టిఫినేమైనా చెయ్యరాదు! నాకోసం కాకపోయినా మీ అన్నగారికయినా" అన్నాను.

"అక్కడికి రోజు మీకడుపు మాడుస్తున్నట్టు! ఎంతసేపూ నన్నాడిపోసుకుందామనే" అంది.

"ఏమో నువ్వేం చేసిపెడుతున్నావో! లేకపోతే మా అన్నయ్య అల్లా అనడు. ఆయన ధర్మరాజు" అంది సుశీల.

"కానీ ఆయన ధర్మరాజేగాని నా నోరు తడి చెయ్యడానికైనా ఏదో ఒకటి చెయ్యవమ్మా. ఇంటిదగ్గిర రోజు మజ్జ నీళ్ళేగా" అన్నాడు రాధ సుశీల కేసి చూసి నవ్వుతూ.

"నువ్వు తెచ్చే జీతానికి అదిచాలు. మా చెల్లెలు గనక ఆ మాత్రమైనా పెడుతోంది. లేకపోతే అదీ లేదు" అన్నాను నేను.

"మూడొందలు తెచ్చే ఆయనకే మజ్జిగనీళ్లు సరిపోతే మీ కింకోపాతిక తక్కువేగా మీ కెక్కడనించి వస్తాయి పిండివంటలు?" అంది కమల.

"ఆయన తెచ్చే మూడువందలలో యాభై రూపాయలు సిగరెట్లకే పోతాయి. మా అన్నయ్యకలాంటి అలవాట్లేమీ లేవుగా" అంది సుశీల.

నలుగురం కూడితే ఒకళ్ళనొకళ్ళు ఆడిపోసుకోడం రెండోవాళ్ళు సమర్థించడంతో చాలా హాయిగా గడిచిపోతుంది. ఎంతో సరదాగా కాలక్షేపం అవుతుంది.

సాయంత్రం వంటలు ముగించారిద్దరూ కలిసి. అక్కడా పోట్లాటే. ఒకరేనంటే ఇంకోరు కాదనడం మూడోవారు సమర్థించడం నాలుగోవారు ఖండించడం.

ఈ వాదులాటలతో ఫస్టుషో టైం దాటబెట్టాము. భోజనాలు కానిచ్చి మళ్ళీ చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాం. సెకండుషో సినిమా టైంగూడ దాటబెడితే బాగుండదని దానికి వెళ్ళాం. షో మొదలెట్టేవరకు యింకా ఒకరొకసినిమాకంటే ఇంకోళ్లింకోటి. ఇల్లా చేసి నలుగురిలో ఏ ఒక్కరూ చెప్పని సినిమాకి దారితీసాం. ఏమిటో సినిమాకి వెళ్ళాలనేగాని ఏదైనా మాకేం సంబంధము లేదు.

సినిమానించి సుశీల రాధగారు వాళ్లింటికి వెళ్లిపోయారు. మేము మాయింటికి వేంచేసాము.

"ఇవాళెంత హాయిగా గడిచిపోయింది. కాని యిట్టే ఐపోయింది. వారంరోజులనించి ఎదురు చూసినరోజు ఇట్టే వచ్చి ఇట్టే అయిపోయింది. మళ్ళీ రేపటినుంచి ఆఫీసు, ఆఫీసరు, అంతా వెధవ గొడవ" అన్నాను నిస్పృహతో.

"ఆఫీసంటే అంత బాధయితే ఉద్యోగం వదిలేసి ఏమైనా పాతు దొరుకుతుందేమో వెతకడం మొదలుపెట్టండి" అంది పెడసరంగా కమల.

"అబ్బ. పాతు వెతకడం ఎందుకు? అంతకన్న సులభంగా తేలిపోయే ఉపాయం ఉంటేను. నువ్వు పుట్టింటికి దయచెయ్. నేను వైరాగ్యంలో కలిసిపోతాను. అప్పుడిద్దరికీ తప్పుతుంది బాధ" అన్నాను నవ్వుతూ.

"అంత మనసు పడకండి. మంచైతేగాదు గాని చెడ్డకేం?" అంది వెక్కిరిస్తూ.

మాటల్లోనే మాకీ పెడసరం. అదీ బాగానే ఉంటుంది- ఉలుకుపలుకులేని అలుమగలకంటె.

లైటు ఆర్పి బెడ్ రూములోకి దారి తీసాం.